# బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 24 డిసెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## వీఆర్వో వ్యవస్థ పునరుద్ధరణ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

వీఆర్వో వ్యవస్థ పునరుద్ధరణకు కాంగ్రెస్? ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారి నియామకం చేపట్టనుంది. ఈ మేరకు పాత ఉద్యోగులను మళ్లీ వీఆర్వో పోస్టులోకి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇతర శాఖల నుంచి తీసుకుని వీఆర్వోలుగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆసక్తి, అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. ఈమేరకు ఈ నెల 28 వరకు గడువు విధిస్తూ సీసీఎల్ఏ కమిషనర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. కాగా గత ప్రభుత్వ హయాంలో అర్హులైన వీఆర్వోలను ఇతర శాఖలకు బదలాయింపు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వీఆర్వోలను వెనక్కి రప్పించేందుకు చర్యలు చేపట్టింది. కలెక్టర్ల పర్యవేక్షణలో వీఆర్వోలను ఇతర శాఖలను వెనక్కి రప్పించే ప్రక్రియ జరగనున్నట్లు సమాచారం.

## రాష్ట్రాభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలి

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశం




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన ప్రసంగించారు. వ్యవసాయ రుణాల పంపిణీలో బ్యాంకులు వేగం పెంచాలని సూచించారు. 2024 ఖరీఫ్ సీజన్లో రూ.54,480 కోట్ల రుణాలు లక్ష్యం కాగా రూ.44,438 కోట్లు (81.57 శాతం) విడుదల చేశారని తెలిపారు. రబీ రుణాల పంపిణీకి నెలరోజుల సమయమున్నందున మరింత వేగం పెంచడం ద్వారా 100 శాతం లక్ష్యం సాధించాలని కోరారు. రాష్ట్రంలో బ్యాంకర్ల రీపేమెంట్ పెరిగిందనీ, అదే సందర్భంలో రుణాల మంజూరు తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సహజ ఆర్థిక సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ విధానం నుంచి బయటపడాలని బ్యాంకర్లకు సూచించారు. రెండు నెలల వ్యవధిలోనే రూ.21 వేల కోట్లు రైతు రుణమాఫీ కింద బ్యాంకులకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందని గుర్తు చేశారు. టర్మ్ లోన్ల విషయంలో లక్ష్యానికి మించి పని చేయడం పట్ల బ్యాంకర్లను ఆయన అభినందించారు. అదే సందర్భంలో ఆయిల్ ఫామ్, తదితర రుణాల విషయంలో ఉదారంగా ఉండాలని కోరారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎమ్ఈ) పరిశ్రమల రుణ లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్పొరేట్ కంపెనీలకు పెద్ద మొత్తంలో రుణాలు ఇవ్వడం మూలంగా కొద్ది మంది చేతిలో ఆర్థిక వ్యవస్థ కేంద్రీకృతమవుతుందనీ, ఫలితంగా ఆర్థిక అసమానతలు పెరుగుతాయని గుర్తు చేశారు. పెద్ద మొత్తంలో ఉపాధి, వస్తువులను ఉత్పత్తి చేస్తున్న ఎంఎస్ఎమ్ఈ రంగానికి విరివిగా రుణాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. మహిళల ను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ. 20 వేల కోట్ల వడ్డీలేనీ రుణాలు అందించడం ద్వారా రాబోయే ఐదేండ్లలో కోటి మందిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యమని అన్నారు. ఈ పథకానికి బ్యాంకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్వయం సహాయక సంఘాల ద్వారా 1000 మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందనీ, గ్రీన్ పవర్ ఉత్పత్తికి బ్యాంకర్లు పెట్టుబడులు సమకూర్చాలని కోరారు. విస్తృతమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో రాబోయే రోజుల్లో వైబ్రెంట్ తెలంగాణను చూస్తారని అన్నారు. మూసీ పునర్జీవం ప్రాజెక్ట్, స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు దన్నుగా ఉండే ఫార్మా కంపెనీల నిర్మాణం పెద్ద ఎత్తున చేపడుతున్నట్టు తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చాయనీ, త్వరలో టెండర్లు పిలవబోతున్నట్టు తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా ద్వారా రైతులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సంక్షేమ పథకాల రూపంలో వేల కోట్లు విడుదల చేస్తున్నామని అన్నారు. ఆయా సబ్సిడీ పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్ల రూపంలో పెద్ద సంఖ్యలో రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కోరారు.

## శ్యామ్ బెనగల్ ఇకలేరు..

- హైదరాబాద్ సంస్థానంలో జననం
- అనారోగ్యంతో బాధపడుతూ మృతి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రముఖ దర్శకుడు శ్యామ్ బెనెగల్(90) కన్నుమూశారు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ సోమవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. శ్యామ్ బెనెగల్ చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం సాయంత్రం 6:00 గంటలకు శ్యామ్ బెనగల్ ఈ లోకానికి శాశ్వతంగా వీడ్కోలు పలికారు. శ్యామ్ బెనగల్ మరణవార్తతో సినీ ప్రపంచం దిగ్భ్రాంతికి గురైంది.శ్యామ్ బెనగల్ మరణంపై పలువురు సెలబ్రిటీలు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

శ్యామ్ బెనగల్ 1934 డిసెంబర్ 14న హైదరాబాద్ సంస్థానంలో జన్మించారు. కొంకణి మాట్లాడే చిత్రాపూర్ సారస్వత బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. శ్యామ్ బెనగల్‌కు సినిమాల పట్ల ఆసక్తి కలగడానికి తండ్రి కారణం. తన తండ్రి ఇచ్చిన కెమెరాతో 12 ఏళ్ల వయస్సులోనే శ్యామ్ బెనగల్ తన మొదటి చిత్రాన్ని రూపొందించారు.హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎకనమిక్స్‌లో మాస్టర్ డిగ్రీ సంపాదించారు. ఆ తర్వాత హైదరాబాద్ ఫిల్మ్ సొసైటీని స్థాపించారు. ఇండియన్ సినిమా చరిత్రలో శ్యామ్ బెనగల్ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును దక్కించుకున్నారు. బాలీవుడ్ చిత్ర పరిశ్రమ ఆయన్ను సినిమా ఆర్ట్ పితామహుడు అని ముద్దుగా పిలుచుకుంటారు. భారత ప్రభు త్వం తరుఫున శ్యామ్ బెనగల్ అనేక అవార్డులు, రివార్డులు సొంతం చేసుకున్నారు.శ్యామ్ బెనగల్‌ను భారత ప్రభుత్వం 1976లో పద్మశ్రీతో, 1991లో పద్మభూషణ్‌తో సత్కరించింది. అంకుర్, మండీ, నిషాంత్, మంథన్, జుబేదా, సర్దారీ బేగం, నేతాజీ సుభాష్ చంద్రబోస్-ది ఫర్‌గాటెన్ హీరో తదితర సినిమాలు ఆయనకు ఎంతో పేరు తెచ్చాయి. ఎనిమిది సార్లు జాతీయ అవార్డులు అందుకోవడం ఆయన ప్రతిభకు నిదర్శనం. 1970 -1980ల సినిమా ఉద్యమంలో శ్యామ్ బెనెగల్ యొక్క సినిమాలు ప్రధాన పాత్ర పోషించాయి. డిసెంబర్ 14న శ్యామ్ బెనగల్ తన 90వ పుట్టిన రోజు వేడుకలను కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య జరుపుకున్నారు. మంగళవారం ఆయన భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

## జీహెచ్ఎంసీ వార్షిక బడ్జెట్ రూ.8,440 కోట్లు

- ఆమోదం తెలిపిన స్టాండింగ్ కమిటీ ఆమోదం




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వార్షిక బడ్జెట్‌కు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.8,440 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. మేయర్ అధ్యక్షతన కమిషనర్ ఇలంబర్తి సమక్షంలో సమావేశమైన స్టాండింగ్ కమిటీ.. బడ్జెట్ అంచనాలపై విస్తృతంగా చర్చించింది. పలు విభాగాలకు సంబంధించి సభ్యులు అడిగిన సందేహాలను ఆయా విభాగాల అధికారులు నివృత్తి చేశారు. దీంతో స్టాండింగ్ కమిటీ....రూ.8,440 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది.రెవెన్యూ రాబడులు రూ.4,445 కోట్లు, రెవెన్యూ వ్యయం రూ.4 వేల కోట్లుగా అంచనా వేశారు. రూ.445 కోట్ల రెవెన్యూ మిగులు చూపారు. హెచ్-సీటీ కింద రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీకి రూ.2,654 కోట్లు గ్రాంట్ రూపంలో కేటాయించినట్లు విజయలక్ష్మి పేర్కొన్నారు. 2024-25లో రెవెన్యూ రాబడులను రూ.5,938 కోట్ల నుంచి రూ. 4,052 కోట్లకు సవరించినట్లు తెలిపారు. ఆమోదిత బడ్జెట్ నుంచి ఘన వ్యర్థాల నిర్వహణకు రూ.687 కోట్లు, వీధి దీపాల కోసం రూ.186 కోట్లు, భూసేకరణ కోసం రూ.283 కోట్లు, ఎస్ఎన్‌డీపీ కింద రూ.408 కోట్లు, హెచ్-సీటీ కోసం రూ.1,690 కోట్లు, గ్రీన్ బడ్జెట్‌కు రూ.344 కోట్లు కేటాయించబోతున్నట్లు మేయర్ తెలిపారు.స్టాండింగ్ కమిటీ సభ్యులు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, మహమ్మద్ ముజఫర్ హుస్సేన్, మహమ్మద్ ఖదీర్, మన్నె కవితా రెడ్డి, మహమ్మద్ రషీద్ ఫరాజుద్దీన్, ఉప్పలపాటి శ్రీకాంత్, సబిహ బేగం, చింతల విజయ శాంతి, కంది శైలజ, అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, గీతా రాధిక, సుభద్ర దేవి, నళిని పద్మావతి, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, పంకజ, సరోజ, అశోక్ సామ్రాట్, రఘు ప్రసాద్, చంద్ర కాంత్ రెడ్డి, యాదగిరి రావు, జోనల్ కమిషనర్లు అపూర్వ్ చౌహాన్, అనురాగ్ జయంతి, రవికిరణ్, వెంకన్న, ఉపేందర్ రెడ్డి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వెంకటేశ్వర్ రెడ్డి, ఫైనాన్స్ అడ్వైజర్ శరత్ చంద్ర, సిసిపి శ్రీనివాస్, చీఫ్ వెటర్నరీ అబ్దుల్ వకీల్, సి.ఇ మెయింటెనెన్స్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## అల్లు అర్జున్‌కు నోటీసులు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్‌కు హైదరాబాద్‌లోని చిక్కడపల్లి పోలీసులు నోటీసులు జారీ చేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నెల 4న ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ మతి చెందగా ఆమె కుమారుడు సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ కేసులో పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయగా హైకోర్టు నాలుగు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. దాంతో ఆయన ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు.

## హైకోర్టులో కేసీఆర్, హరీశ్‌రావులు క్వాష్ పిటిషన్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భూపాలపల్లి కోర్టు ఇచ్చిన నోటీసులను కొట్టివేయాలని హైకోర్టులో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులు క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని ముఖ్యమైన ఆనకట్ట అయిన మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో అవినీతి జరిగిందంటూ గతంలో భూపాలపల్లి కోర్టులో సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి అనే వ్యక్తి పిటిషన్ వేసారు. అనంతరం 2024 సెప్టెంబర్ 5, అక్టోబర్ 17వ తేదీల్లో భూపాలపల్లి జిల్లా కోర్టు విచారణ చేపట్టింది. తరువాత తదుపరి విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది. ఈ క్రమంలో కేసీఆర్, హరీశ్‌రావులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.

మేడిగడ్డ బ్యారేజీని నిర్మించే క్రమంలో ప్రజాధనం వృథా అయిందని, నిర్మాణంలో ప్రమాణాలు పాటించలేదని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజలింగమూర్తి పిటిషన్ ఆధారం చేసుకుని భూపాలపల్లి కోర్టు కేసీఆర్, హరీశ్ రావులతో సహ మరో ఆరుగురికి నోటీసులను జారీ చేసింది. ఈ నోటీసులను సవాలు చేస్తూ తాజాగా హైకోర్టులో కేసీఆర్, హరీశ్‌రావులు ఈ నోటీసులను కొట్టివేయాలని పిటిషన్లు వేశారు. దీంతో వీరి పిటిషన్లపై రేపు మంగళవారం (డిసెంబరు 24న) హైకోర్టు విచారణ చేపట్టనుంది. ప్రైవేట్ పిటిషన్‌పై 2024 జులై 10న భూపాలపల్లి నోటీసులను జారీ చేసింది. గతంలో 2024 ఆగస్టు 5వ తేదిన మేడిగడ్డ బ్యారేజీపై దాఖలైన పిటిషన్‌పై విచారణకు హాజరు కావాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు భూపాలపల్లి జిల్లా కోర్టు నోటీసులు జారీ చేసింది. ఆయనతో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావు, బ్యారేజీ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ జనరల్ మేనేజర్ సురేశ్‌కుమార్ సహా మరో ఐదుగురికి నోటీసులు పంపింది.

## 30న తెలంగాణ కేబినెట్ భేటీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ మంత్రివర్గ సమావేశం ఈ నెల 30న రాష్ట్ర సచివాలయంలో జరగనుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సమావేశంలో రైతు భరోసా, రేషన్ కార్డుల విధివిధానాలపై, భూమి లేని నిరుపేదలకు నగదు బదిలీపై, యాదగిరిగుట్ట ఆలయ బోర్డుపై కేబినెట్ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.

## నో డిటెన్షన్ విధానం రద్దు

- పాఠశాలల్లో మళ్లీ డిటెన్షన్ విధానం
- విద్యాహక్కు నిబంధనలకు కేంద్రం సవరణ
- రాష్ట్రాలదే నిర్ణయాధికారం

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ఉచిత, నిర్బంధ విద్యకు సంబంధించి పిల్లలకు ఉన్న హక్కు (ఆర్టీఈ) నిబంధనలను కేంద్రం సవరించింది. కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, సైనిక్ పాఠశాలల్లో 'నో డిటెన్షన్ విధానం' రద్దు చేసింది. ఈ క్రమంలో ఇకపై 5, 8 తరగతుల విద్యార్థులు వార్షిక పరీక్షల్లో తప్పనిసరిగా పాస్ కావాల్సి ఉంది. ఒకవేళ పాస్ కాకుంటే విద్యార్థులు మళ్లీ అదే తరగతుల్లో కొనసాగాల్సి ఉంది. విద్యా హక్కు చట్టం - 2019కు చేసిన సవరణ ప్రకారం దేశవ్యాప్తంగా తెలుగు రాష్ట్రాలు మినహా 16 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాలు ఇప్పటికే ఈ 2 తరగతులకు సంబంధించి నో డిటెన్షన్ విధానాన్ని తొలగించాయని పేర్కొంది.2009లో ఆర్టీఈ చట్టాన్ని ఆమోదించినప్పటి నుండీ ఈ విధానం కొనసాగుతోంది. 2019లో ఈ చట్టాన్ని సవరించారు. సవరించిన నిబంధనల ప్రకారం ప్రతి విద్యా సంవత్సరం చివరలో 5,8 తరగతులకు రాష్ట్ర ప్రభుత్వాలు వార్షిక పరీక్షలు నిర్వహించవచ్చు. పరీక్షలో ఫెయిలైన వారికి అదనపు క్లాసులు నిర్వహించి రెండు నెలల తర్వాత మళ్లీ పరీక్ష నిర్వహిస్తారు. అప్పుడూ ఫెయిలైతే డిటెయిన్ చేసి మళ్లీ అదే క్లాసులో ఉంచుతారు. కేంద్ర ప్రభుత్వ చర్యపై వివిధ రాష్ట్రాలలో మిశ్రమ స్పందన కన్పించింది. గుజరాత్, ఒడిషా, మధ్యప్రదేశ్, జార్ఖండ్, కర్నాటక, ఢిల్లీ రాష్ట్రాలు కేంద్ర నిర్ణయాన్ని అమలు చేయాలని ఇప్పటికే నిర్ణయించాయి. అయితే అన్ని రాష్ట్రాలూ కేంద్ర నిర్ణయాన్ని స్వాగతించడం లేదు. ఉదాహరణకు 5, 8 తరగతులకు వార్షిక పరీక్షలు నిర్వహించడంపై కేరళ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.కేంద్ర నిర్ణయం విద్యార్థులపై ఒత్తిడి పెంచుతుందని అభిప్రాయపడింది. పరీక్షలో ఫెయిలయిన విద్యార్థులను తిరిగి అదే తరగతిలో కొనసాగించడాన్ని 2009లో ప్రవేశపెట్టిన ఆర్టీఈ చట్టం నిషేధిస్తోంది. 2019లో ఈ విధానానికి సవరణ చేశారు. కాగా 5, 8 తరగతులకు వార్షిక పరీక్షలు నిర్వహించి డిటెన్షన్ విధానాన్ని అమలు చేయాలా వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకోవాల్సింది రాష్ట్రాలే. అయితే సవరించిన నిబంధనల ప్రకారం పరీక్షలు సరిగా రాసినా లేకున్నా 8వ తరగతి పూర్తయ్యే వరకూ ఎవరినీ పాఠశాల నుంచి బయటికి పంపకూడదు. అయితే తాజాగా విద్యా ప్రమాణాలు పాటించని విద్యార్థులను అదే తరగతిలో కొనసాగించేందుకు పాఠశాలలకు అధికారాలు కల్పించారు.

## ఆక్రమణలు తొలగించండి

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- నగరంలోని పలు చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్
- తౌతానికుంట, భగీరథమ్మ చెరువు, నార్సింగ్‌లోని నెక్నాంపూర్ చెరువుల ఆక్రమణలపై కమిషనర్ ఆగ్రహం




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఔటర్ రింగ్ రోడ్డుకు (ఓఆర్ఆర్) ఆనుకుని ఉన్న పలు చెరువులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్. క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువుల ఆక్రమణతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు ప్రత్యక్షంగా విచారించారు. చెరువులలో మట్టిపోయడం, వరద కాలువలు కనిపించకుండా నిర్మాణాలు చేపట్టడం, తౌతాని కుంట, భగీరథమ్మ చెరువుకు వెళ్లే కాలువ లింకు తెగటంతో ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బందులు పడుతున్నట్టు స్థానికులు ఫిర్యాదు చేయడంతో తనిఖీ చేపట్టారు.నానక్‌రామ్‌గూడకు సమీపంలోని తౌతానికుంట, భగీరథమ్మ చెరువు, నార్సింగిలోని నెక్నాంపూర్ చెరువులు ఆక్రమణకు గురవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా చెరువుల్లోకి వరద నీరు చేరకుండా కాలువలను మళ్లించడం, మూసివేయడంపై విచారణకు ఆదేశించారు. చెరువులను పరిశీలించేందుకు వచ్చిన హైడ్రా కమిషనర్‌కు పలువులు స్థానికులు తమ సమస్యలు వినిపించారు.

మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఖాళీస్థలం నుంచి వర్షపు నీరు వెళ్లే రహదారులు మూసుకుపోవడంతో సమీపంలో ఉన్న అపార్టుమెంట్‌లోకి వరద నీరు వచ్చి చేరుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు స్థానికులు. వరదనీరు తౌతాని కుంట ద్వారా భగీరథమ్మ చెరువుకు చేరేలా చేసి ఇబ్బంది తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కొందరు చెరువులకు ఆనుకుని ఉన్న తమ స్థలాలను కాపాడాలని కోరగా.. పూర్తి వివరాలు హైడ్రాకు సమర్పిస్తే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

నానక్‌రామ్‌గూడకు సమీపంలోని వరదనీటి కాలువలపై ఉన్న అక్రమ నిర్మాణాలు, దుకాణాలు వెంటనే తొలగించాలని ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, నీటిపారుదల, జీహెచ్ఎంసీ(గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్), హెచ్ఎండీఏ (హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ) అధికారులను సంప్రదించి సమగ్ర నివేదిక సమర్పించాలని హైడ్రా అధికారులతో అన్నారు. గ్రామీణ మ్యాప్‌లతో పాటు.. నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, సర్వే ఆఫ్ ఇండియా, తెలంగాణ విభాగాలకు చెందిన మ్యాప్‌లతో పూర్తి స్థాయి పరిశీలన జరిపించి వారం రోజుల్లోగా నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశించారు.



## ఏడాదిన్నరలో 10 లక్షల ఉద్యోగులు

- ప్రధాని మోడీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గత ఏడాదిన్నర కాలంలో తమ ప్రభుత్వం యువతకు దాదాపు 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిందని, ఇది ఒక భారీ రికార్డు అని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. ఇంతకు ముందు ఏ ప్రభుత్వ హయాంలో ఇలా 'మిషన్ మోడ్'లో ఉద్యోగ కల్పన జరగలేదని విమర్శించారు. దేశంలోని యువత సామర్థ్యాన్ని, ప్రతిభను పూర్తిగా ఉపయోగించుకోవడమే తమ ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యమని తెలిపారు.ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే యువత బలం, నాయకత్వం ద్వారానే సాధ్యమని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. రోజ్ గార్ మేళాలో భాగంగా కొత్తగా నియమైతులైన 71వేల మంది ఉద్యోగులకు అపాయింట్‌మెంట్ లెటర్‌లను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం అందిం చారు. వారికి శుభాకాంక్షలు చెబుతూ యువతను ఉద్దేశించి మాట్లాడారు."రోజ్‌గార్ మేళా ద్వారా మేం నిరంతరం కృషి చేస్తున్నాం. నేడు 71,000 మందికి పైగా యువత కొత్త ఉద్యోగులుగా నియమితులయ్యారు. గత 1.5 సంవత్సరాల్లో మా ప్రభుత్వం దాదాపు 10 లక్షల మంది యువతకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలను అందించింది. ఇది ఒక భారీ రికార్డు. నిజాయితీ, పారదర్శకతతో లక్షలాది మంది యువత ఉద్యోగాలు పొందుతున్నారు" అని మోదీ తెలిపారు. "2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మిస్తాని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేశారు. మేం ఆ ప్రతిజ్ఞను విశ్వసిస్తున్నాం. ఎందుకంటే దేశంలోని ప్రతి విధానం, నిర్ణయంలో ప్రతిభావంతులైన యువత పాత్ర ఉంది. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, డిజిటల్ ఇండియా- ఇలా ప్రతి ఒక్కటి యువతను కేంద్రంగా చేసుకుని రూపొందించిన కార్యక్రమాలే" అని ప్రధాని చెప్పారు. జాబ్ రిక్రూట్‌మెంట్‌లో అధిక సంఖ్యలో మహిళలు ఉన్నారని పేర్కొన్న మోదీ, వారు ప్రతి రంగంలో స్వయం ప్రతిపత్తిని సాధించడం తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మహిళలకు 26 వారాల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వారి కెరీర్‌లో ఎంతో దోహదపడిందని చెప్పారు. పీఎం ఆవాస్ యోజన కింద నిర్మించిన ఇళ్లల్లో మహిళలే ఎక్కువ మంది యజమానులని వెల్లడించారు.

## ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్‌గా వి.రామసుబ్రమణ్యం

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) చైర్మన్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి వి.రామసుబ్రమణ్యం నియమితులయ్యారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్‌గా పనిచేసిన జస్టిస్ అరుణ్ మిశ్రా గత జూన్ 1 రిటైరయ్యారు. దీంతో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతి సయాని తాత్కాలిక చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తూ వచ్చారు.ఎన్‌హెచ్‌ఆర్‌సీ కొత్త చైర్మన్‌గా నియమితులైన జస్టిస్ వి.రామసుబ్రహ్మణ్యం మద్రాసు లా కాలేజీలో న్యాయవిద్య పూర్తి చేశారు. 1983 ఫిబ్రవరి 16న బార్ మెంబర్‌గా పేరు నమోదు చేసుకున్నారు. మద్రాసు హైకోర్టులో 23 ఏళ్లు లాయర్‌గా ప్రాక్టీసు చేశారు. 2006 జూలై 31న మద్రాసు హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులై, 2009 నవంబర్ 9న శాశ్వత జడ్జిగా బాధ్యతలు నిర్వహించారు. తన సొంత రిక్వెస్ట్ మీద 2016 ఏప్రిల్ 27న హైదరాబాద్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. రెండు రాష్ట్రాల విభజన తర్వాత 2019 జనవరి 1 నుంచి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా కొనసాగారు. 2019 జూన్ 22 నుంచి హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఉన్నారు. 2019 సెప్టెంబర్ 23న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2023 జూన్ 29న పదవీ విరమణ చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నడిపించేది బీజేపీనే..

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు కలిసే పనిచేస్తున్నాయని, ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ దాన్ని బీజేపీ నడిపిస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసు నమోదు చేయడంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటేనని మరోసారి రుజువయ్యిందని స్పష్టం చేశారు. ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి బీజేపీ పెద్దలను కలిసిన తర్వాతే కేటీఆర్ పై ఏసీబీ కేసు నమోదు చేసిందని తెలిపారు. "తొలుత సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో బీజేపీ పెద్దల ను కలిశారు. ఆ తర్వాత గవర్నర్ కేసు నమోదుకు అనుమతి ఇచ్చారు. తదనంతరం ఏసీబీ కేసు నమోదు చేసిన మరునాడే ఈడీ కేసు నమోదు చేసింది. దీన్ని బట్టి చూస్తే ఆ రెండు పార్టీలు కలిసే పనిచేస్తున్నట్లు స్పష్టమవుతోంది" అన్నారు.. సోమవారం ఎమ్మెల్సీ కవిత తెలంగాణ భవన్‌లో



మీడియాతో చిట్ చాట్ చేశారు.

ప్రాంతీయ పార్టీలు ఉండకుండా చేయాలన్నది కాంగ్రెస్, బీజేపీలు కలిసి చేస్తున్న కుట్ర అని తెలిపారు. ముఖ్యంగా కేసీఆర్ వంటి బలమైన

మిగితా 2వ పేజీలో

# నలుదిక్కులా అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



● ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నలుదిక్కులా అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని, నగరం నడిబొడ్డున ఐటీ సంస్థను నెలకొల్పడం ఇందుకు నిదర్శనమని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం హైదరాబాద్ అమీర్‌పేట మెట్రో స్టేషన్ పక్కన గల అతిపెద్ద వర్క్ స్పేస్‌లో మాల్పాని వారి ఎంపీఎం గ్రూప్ సంస్థ ఆధ్వర్యంలో నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేయగా మంత్రి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములై ముందుకు సాగాలని తెలిపారు. నగరం నడిబొడ్డున సైతం ఐటీ సంస్థలు నెలకొల్పి అందరికీ ఉపాధి అందించడానికి కృషి చేయాలని సూచించారు. ప్రాథమికంగా స్టార్టప్స్‌కు, ఇన్నోవేషన్‌కు సంబంధించిన చిన్న మధ్యతర కంపెనీలకు ఒక సదుపాయం కల్పించే కార్యక్రమం చేపట్టిన ఎంపీఎం గ్రూప్ వారికి అభినందనలు తెలిపారు. సౌత్, నార్త్, ఈస్ట్ ఆఫ్ హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పెద్దఎత్తున అభివృద్ధి చేయాలనే ఆలోచనతోనే తమ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాల ప్రాంతాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్న కంపెనీలకు మెట్రో సదుపాయం, విమానాశ్రయానికి కొన్ని నిమిషాల్లో చేరేలా వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ ఇండస్ట్రియల్ కమిషనర్ జయష్ రంజన్, ఎంపీఎం మాల్పాని సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో అబద్ధాలు చెప్పిన్రు

● మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అసెంబ్లీలో అబద్ధాలు చెప్పారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీని కూడా అబద్ధాల వేదికగా మార్చిందని మండిపడ్డారు. హనుమకొండలో సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని హరీశ్‌రావు సందర్శించారు.

%ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు వ్యవసాయ పనిముట్లు ఇవ్వలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అంటడు, స్ప్రింక్లర్లు ఇవ్వలేదంటడు, రుణమాఫీ చేయలేదంటడు. మేం రైతులకు ఇవన్నీ ఇవ్వకపోతే రాజీనామా చేస్తా.. మీరు సిద్ధమా భట్టి విక్రమార్క అని ప్రశ్నిస్తే సమాధానం లేదు. బీఆర్‌ఎస్ రూ. 7 లక్షల కోట్ల అప్పు చేసిందని అసెంబ్లీలో అబద్ధాలు చెప్పారు. అసెంబ్లీలో నేను లెక్కలతో సహా అప్పజెప్పిన. బీఆర్‌ఎస్ చేసింది కేవలం రూ. 4 లక్షల 17 వేల కోట్లే అని, మీరు రూ. 7 లక్షల కోట్ల అప్పు అని అబద్ధాలు చెప్తే లీగల్‌గా చర్యలు తీసుకుంటమని చెప్పానని హరీశ్‌రావు పేర్కొన్నారు.

సర్వశిక్ష అభియాన్ 1523 ఉద్యోగాలు మేమే ఇచ్చినం, మీ సమస్యల పరిష్కారానికి అండగా ఉంటం. చాయ్ తాగినంత సేపట్లో మీ సమస్యలు పరిష్కరిస్తానని చెప్పి, ఇప్పటికీ చేయలేదు ఈ ముఖ్యమంత్రి. అందుకే మీరు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగట్టి, ప్రజల ముందు వారి నిజస్వరూపాన్ని బయట పెట్టాలె. కేసీఆర్ చేసిన పనులన్నీ మీకు అర్థమవుతున్నయి. అందుకే నిజం నిలకడ మీద తెలుస్తది అన్నరు. ఇవాళ ప్రశ్నిస్తే కేసులు, అడిగితే కేసులు, ప్రజా ప్రభుత్వంలో 7వ గ్యారంటీ



పరిస్థితి ఇవాళ రాష్ట్రంలో ఉన్నదా? పాలసీ మ్యాటర్ అడిగితే హౌస్ అరెస్టు, కేసులు పెడుతున్నరు అని హరీశ్‌రావు మండిపడ్డారు.

సినీ హీరో అల్లు అర్జున్‌ను అరెస్టు చేసినవు సరే, కొండారెడ్డిపల్లె మాజీ సర్పంచ్ ఆత్మహత్యకు కారణమైన నీ సోదరుడు తిరుపతి రెడ్డిని కూడా అరెస్టు చేయించు. ఎందుకు అరెస్టు చేయించడం లేదు, చట్టం కాంగ్రెస్ పార్టీకి చుట్టమైందా? 54 మంది హాస్టల్ విద్యార్థులు మరణిస్తే.. ఇది ప్రజా పాలనా? లగచర్ల రైతులకు బేడీలు వేస్తే.. ఇది ప్రజా పాలనా? సీఎం రేవంత్ రెడ్డీ, నువ్వు మనిషివైతే, మాట మీద నిలబడితే, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించు అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నడిపించేది బీజేపీనే..

(మొదటి పేజీ తరువాయి)

నాయకులను దెబ్బకొట్టాలని ఆ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని, కానీ వాటికి సాధ్యంకాదని తేల్చిచెప్పారు. కక్షసాధింపులో భాగంగానే కేటీఆర్‌పై ఏసీబీ, ఈడీ కేసు నమోదు చేశాయని, ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నందునే కేటీఆర్‌ను టార్గెట్ చేశారని చెప్పారు. రాష్ట్రంలో ప్రతీకార పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికే అల్లు అర్జున్ వ్యవహారాన్ని ప్రభుత్వం తెరమీదికి తీసుకొచ్చిందని అన్నారు.

తెలంగాణలో 10 శాతం కమిషన్ ప్రభుత్వం నడుస్తుందని అన్నారు. అందరి కోసం కాకుండా.. కొందరి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రభుత్వ ప్రాధాన్యతలు పెద్ద వాళ్లపైనే ఉన్నాయని విమర్శించారు. మెఘా కృష్ణా రెడ్డి వంటి వారి కంపెనీలకు వేల కోట్ల రూపాయల బిల్లులు చెల్లిస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్%ా% పేదలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలకు మాత్రం నిధులు విడుదల చేయడం లేదని ఎండగట్టారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విషాహారం తిని గురుకులాల్లో 57 మంది పిల్లలు చనిపోయారని, వారి కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కాకపోవడం వల్ల అనేక మంది రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందిస్తామని ప్రకటించారు.

సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణను ప్రపంచ బ్యాంకుకు తాకట్టుపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ బ్యాంకుకు తాకట్టుపెడుతున్నా కమ్యూనిస్టులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. ప్రపంచ బ్యాంకు చీకటి చరిత్ర నేపథ్యంలో పదేళ్ల పాటు ఆ బ్యాంకును కేసీఆర్ తెలంగాణకు దూరంగా ఉంచారని పేర్కొన్నారు. భూభారతితో భూభద్రత ఉండదని స్పష్టం చేశారు. భూభారతి చట్టం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను నాశనం చేస్తున్నదని అన్నారు. పజలు తిరిగి ధరణి వ్యవస్థనే కావాలని ఉద్యమించే పరిస్థితి వస్తుందని తెలిపారు.

తెలంగాణ అస్తిత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీసే కుట్ర చేస్తున్నదని, దాన్ని తాము బలంగా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. గ్రామ గ్రామానా ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రతిష్టిస్తామని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న ఒక కొత్త ప్రాజెక్టు కూడా చేపట్టలేదని విమర్శించారు. ఇప్పటికే నడుస్తున్న ప్రాజెక్టులను కూడా పూర్తిచేయని పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. ముఖ్యంగా కొద్దిపాటి నిధులు వెచ్చించి మూడు నాలుగు కిలోమీటర్ల మేర పనులు చేపడితే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ఇప్పటికే నీళ్లు అందేవని వివరించారు. కానీ ప్రాజెక్టును పూర్తి చేయడానికి మాత్రం ప్రభుత్వానికి మనసు రావడంలేదని స్పష్టం చేశారు. పరిమిత నిధులు వెచ్చించడం ద్వారా పూర్తయ్యే ప్రాజెక్టులను కూడా ప్రభుత్వం విస్మరించడం దారుణం అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పుష్కలంగా నిధులు వస్తున్నాయని ప్రభుత్వమే చెబుతుంది కానీ ఒక పైసా కూడా ప్రజలకు చేరడం లేదని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ అమలు చేయడం లేదని, తద్వారా ఒక మహిళకు ప్రభుత్వం రూ. 30000 బాకీ పడిందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు పేరిట బస్సుల సంఖ్యను తగ్గించారని, తద్వారా మహిళలే కాకుండా విద్యార్థులు కూడా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

## జనవరి 20న దావోస్‌కు సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనకు వెళ్లనన్నారు. జనవరి 20 నుంచి 24 వరకు ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సుకు ముఖ్యమంత్రి హాజరయ్యే అవకాశం ఉంది. తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించే ఉద్దేశంతో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ప్రతినిధులు బృందం దావోస్‌లో పర్యటించబోతున్నారు. ఈ నేపథ్యంలో ఈ పర్యటన నిమిత్తం ఐటీ శాఖ బడ్జెట్ నుంచి రూ.12.30 కోట్లు మంజూరు చేస్తూ ప్రత్యేక సీఎస్ జయేష్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు.

# హసీనాను ఢాకాకు పంపండి

● భారత్‌కు బంగ్లాదేశ్ దౌత్య సందేశం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మాజీ ప్రధాని షేక్ హసీనాను తిరిగి ఢాకాకు పంపాలంటూ బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం సోమవారం భారత్‌కు దౌత్యపరమైన సందేశాన్ని పంపింది. బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాల సలహాదారు తౌహిద్ హుస్సేన్ తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 'మేము భారత ప్రభుత్వానికి దౌత్యపరమైన సందేశాన్ని పంపాము. న్యాయపరమైన ప్రక్రియ కోసం ఆమె స్వదేశానికి రావాలని బంగ్లాదేశ్ కోరుకుంటోంది' అని చెప్పారు. అంతకుముందు ఉదయం హోం శాఖ సలహాదారు జహంగీర్ ఆలం మాట్లాడుతూ తన కార్యాలయం విదేశాంగ మంత్రిత్వ శాఖకు ఓ లేఖ పంపిందని తెలిపారు. పదవీచ్యుతురాలైన హసీనా అప్పగింతకు వీలు కల్పించాల్సిందిగా అందులో కోరామని వివరించారు. 'హసీనా అప్పగింతకు సంబంధించి విదేశాంగ శాఖకు లేఖ పంపాము. ఆ ప్రక్రియ కొనసాగుతోంది' అని అన్నారు. భారత్, బంగ్లాదేశ్ మధ్య నేరస్థుల అప్పగింత ఒప్పందం అమలులో ఉన్నదని ఆలం తెలిపారు. ఈ ఒప్పందం కింద హసీనాను ఢాకాకు తీసుకురావచ్చునని చెప్పారు. 77 సంవత్సరాల హసీనా ఆగస్టు ఐదవ తేదీ నుండి భారత్‌లో ప్రవాస జీవితం గడుపుతున్నారు. విద్యార్థుల నేతృత్వంలో పెద్ద ఎత్తున జరిగిన ఆందోళన కారణంగా 16 సంవత్సరాల హసీనా పాలనకు తెర పడింది. ఢాకాలోని అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ఐసీటీ) హసీనా, పలువురు క్యాబినెట్ మాజీ మంత్రులు, సలహాదారులు, సైనిక, పౌర అధికారులపై అరెస్ట్ వారంట్లు జారీ చేసింది.

# పెరిగిన సైబర్ నేరాలు

● సైబర్ సెక్యూరిటీ బ్యూరో 2024 వార్షిక నివేదిక విడుదల

● విడుదల చేసిన సీఐడీ డీజీ షికా గోయల్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



సైబర్ సెక్యూరిటీ బ్యూరో 2024 వార్షిక నివేదికను సీఐడీ డీజీ షికా గోయల్ విడుదల చేశారు. ఈ సంవత్సరంలో సైబర్ నేరగాళ్ల కోసం మూడు ఆపరేషన్స్ నిర్వహించినట్లు శిఖా గోయల్ తెలిపారు. ఈ ఏడాది 18 నుండి 20 శాతం సైబర్ నేరాలు పెరిగాయని వెల్లడించారు. ఈ సంవత్సరం రూ.176 కోట్లు రికవరీ చేసి బాధితులకు తిరిగి ఇచ్చామన్నారు. సైబర్ నేరగాళ్ల అరెస్టులు కూడా గణనీయంగా పెరిగాయని.. 1,057 సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశామని ఆమె తెలిపారు. వీరు తెలంగాణలో 19 కేసుల్లో ఇన్వాల్వ్ అయి ఉన్నారని.. దేశవ్యాప్తంగా ఈ నిందితులు ఇన్వాల్వ్ అయిన కేసులు లక్షల్లో ఉన్నాయన్నారు. సైబర్ నేరాల దర్యాప్తు సమర్థవంతమైన టూల్స్ సైబర్ బ్యూరోతో ఉన్నాయన్నారు. ఈ సంవత్సరం 9800 ఐఎంఈఐ నంబర్లను బ్లాక్ చేయడం ద్వారా నేరగాళ్ల మొబైల్స్ పని చేయకుండా చేశామన్నారు. గత సంవత్సరం 181 ఐఎంఈఐ నంబర్లను మాత్రమే గత సంవత్సరంలో బ్లాక్ చేశామని శిఖా గోయల్ తెలిపారు. యూఆర్‌ఎల్, వెబ్‌సైట్లను కూడా బ్లాక్ చేశామన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కోసం, సందేహాల నివృత్తి కోసం కోసం ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతిసారి 1930 బిజీగా ఉండటం వల్ల వెయిటింగ్ సమయం పెరుగుతుందన్నారు. దీంతో ఓ ఏఐ టూల్ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.

సైబర్ నేరగాళ్లకు నగదు డ్రా చేసి ఏజెంట్ల ద్వారా ప్రధాన నేరగాళ్లకు పంపిస్తున్న 21మందిని అరెస్ట్ చేశామని సీఐడీ డీజీ షికా గోయల్ వెల్లడించారు. సైబర్ నేరగాళ్ల ఖాతాలో పడ్డ సొమ్మును %ం%జెంట్లు క్రిప్టోగా మర్చి ఇతర దేశాలకు పంపిస్తున్నారన్నారు.ఈ ఖాతాలు దేశావ్యాప్తంగా 714 కేసుల్లో ఇన్వాల్వ్ అయ్యాయన్నారు. కొందరు నేరగాళ్లపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేశామని చెప్పారు. మొత్తం ఈ ఖాతాల ద్వారా రూ.8.2 కోట్లు డ్రా చేసి విదేశాలకు పంపారన్నారు. పట్టుబడ్డ వారిలో 13మంది ఖాతాదారులు, 8మంది ఏజెంట్లు ఉన్నారని వెల్లడించారు. 8 మంది ఏజెంట్లు దేశవ్యాప్తంగా 325 కేసుల్లో నిందితులుగా ఉన్నారని ఆమె తెలిపారు. గతంలో ఖాతాలు సమకూర్చిన వారిని మాత్రమే అరెస్ట్ చేశామన్నారు. ఇప్పుడు విత్ డ్రా చేసి ఇతర దేశాలకు పంపుతున్న వారిపై దృష్టి సారించినట్లు శిఖా గోయల్ పేర్కొన్నారు.

ప్రస్తుతం విత్ డ్రా చేసి ఇస్తున్న అకౌంట్స్ అన్ని సేవింగ్స్ అకౌంట్స్ అని ఆమె తెలిపారు. ఒక్కో అకౌంట్ నుండి ఐదు నుండి పది లక్షలు వరకు విత్ డ్రా చేసి ఇచ్చారన్నారు. క్రిప్టో కరెన్సీ ద్వారా వచ్చిన ఇంట్రెస్ట్ అమౌంట్‌ను ఏజెంట్స్ పంచుకుంటున్నారని వెల్లడించారు. క్రిప్టో కరెన్సీ ద్వారా అమౌంట్‌ను ఏజెంట్లు దుబాయ్‌కి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని చెప్పారు. ఈ కేసులో ముగ్గురు నేరస్థులపై మూడు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశామన్నారు. కంబోడియా కేసులో దావూద్‌ని ఇటీవల అరెస్ట్ చేశామని.. 30 మంది యువతను కంబోడియాకు పంపించారని చెప్పారు. అక్కడ చైనీస్ కాల్ సెంటర్లకి 30 మందిని బదిలీ చేశారన్నారు. ఇప్పటివరకు 20 మంది ఏజెంట్స్ అరెస్ట్ అయ్యారన్నారు. లుక్ అవుట్ నోటీస్ జారీ చేసి దావూద్‌ను అరెస్ట్ చేశామన్నారు. టూరిస్ట్ వీసాలపై అమాయకులను మోసాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామమని వెల్లడించారు. లోన్ యాప్ వేధింపులు క్రమంగా తగ్గాయని సీఐడీ డీజీ షికా గోయల్ స్పష్టం చేశారు.

# ప్రజా భద్రత కోసమే పోలీసు

- ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా ఉచిత ఆరోగ్య శిబిరాలు..
- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

గ్రామీణ ప్రాంత ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడానికి కమ్యూనిటి పోలీసింగ్ లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విన్నూత కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని,అందులో భాగంగా జిల్లా కేంద్రానికి సుదూర ప్రాంతల్లో ఉండే ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.

సోమవారం గంభీరావుపేట మండలం లింగాన్నపేట(ఎర్రషేలక తండా)లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అశ్వినీ హాస్పిటల్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ముఖ్య అతిధిగా ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి సుదూర ప్రాంతాల్లో ఉండే ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వారికి సత్వరమే వైద్యం సేవలు అందించడమే లక్ష్యంగా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. నిపుణులు అయిన డాక్టర్ల బృందం ఆధ్వర్యంలో కంటి, దంత, గైనకాలజిస్ట్, న్యూరో, జనరల్ ఫిజీషియన్ , జనరల్ సర్జన్ ,అర్థోపెడిక్, పిల్లల వైద్య నిపుణులు, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు ముందుగా వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం చికిత్సలు అందించడాం జరిగిందని, ఆరోగ్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి మెరుగైన చికిత్స కోసం పెద్ద ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు.



ప్రజలకు పోలీస్ సేవలు మరింత దగ్గర అవ్వడానికి పోలీస్ ఉన్నది ప్రజా భద్రత కోసమే అనే నమ్మకం కలగడం కోరకు కమ్యూనిటీ పోలిసింగ్ లో భాగంగా వివిధ కార్యక్రమాలు చేయడం జరుగుతుందని అందులో భాగంగా గతంలో వీర్నపల్లి,రుద్రంగి మండల పరిధిలోని వివిధ గ్రామాల యువతకు స్పోర్ట్స్ కిట్స్ ,ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఎన్నో సౌకర్యాలు మెరుగు పడ్డాయని తల్లిదండ్రులు అందరూ తమ పిల్లలను చక్కగా చదివించుకుని ప్రభుత్వం ప్రవేశపెట్టిన సౌకర్యాలను సద్వినియొగం చేసుకోవాలన్నారు.యువత చెడు మార్గాల వైపు మరలకుండా చూసుకునే బాధ్యత తల్లిదండ్రుల మీద ఉందని,గంజాయి అలవాటు పడిన వారి వివరాలు అందించాలని వారికి నిపుణులు అయిన వైద్య నిపుణుల చేత కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు .ఉచిత మెగా వైద్య శిబిరానికి పిలువగానే వచ్చిన ఎల్లారెడ్డిపేట్ అశ్విని హాస్పిటల్ వైద్య బృందానికి ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్ఐ శ్రీకాంత్, వైద్య నిపుణులు, గ్రామ ప్రజలు , సిబ్బంది పాల్గొన్నారు.





## అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

ప్రజావాణి అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రజల నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే దరఖాస్తులు పెండింగ్ లో పెట్టవద్దని అధికారు లను ఆదేశించారు.



## ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలి..

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రబీ 2022-23 టెండర్ డెలివరీస్ ను ఈ నెల 31 వ తేదీలోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లాలోని రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్లర్లతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి పి. వసంత లక్ష్మి, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ రజిత, డిప్యూటీ తహసీల్దార్లు (సివిల్ సప్లయ్) నవీన్ కుమార్, రవీందర్ తదితరులు ఉన్నారు

# సాంస్కృతిక సారధి కళాకారుల సమీక్ష సమావేశం



**బలగం టీవీ , తంగళ్లపల్లి**

హైదరాబాదులోని మాదాపూర్ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో జిల్లాకు చెందిన సంస్కృతిక సారధి కళాకారులు సారధి చైర్మన్ డాక్టర్ జి వెన్నెలను శాలువాతో సత్కరించారు.సాంస్కృతిక సారధి చైర్మన్ డాక్టర్ జి వి వెన్నెల గద్దర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా సాంస్కృతిక సారధి పనిచేస్తుందని అందులో కళాకారులు చురుకుగా పాల్గొని ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు. కళాకారుల జీతాల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రతినెల 10వ తారీఖు లోపు జీతాలు వేసే బాధ్యత తాను తీసుకుంటున్నానని సారధి చైర్మన్ అన్నారు.సారధిలో పనిచేస్తూ మరణించిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకునే దిశగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.సారధిలో పనిచేస్తున్న పురుష కళాకారులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కొనసాగించే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా అన్నారు. ప్రతి జిల్లాకు వెహికల్ సౌకర్యం అదేవిధంగా సౌండ్ సౌకర్యం కల్పించే నిషాగా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి సంవత్సరం సాంస్కృతిక సారధిలో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు స్త్రీ మరియు పురుషులకు రెండు అవార్డులు సారధి నుండి అందేలాచూస్తామన్నారు. ప్రతి జిల్లా నుండి కళాకారులు యూట్యూబ్ ఛానల్ జిల్లాల వారీగా తెరిచి జిల్లాలో పనిచేస్తున్న సాంస్కృతిక సారధుల ప్రదర్శనలు అందులో అప్లోడ్ చేయవలసిందిగా కోరారు. ఉద్యోగుల సాధారణ బదిలీలు 15 రోజుల్లో చేపడుతామన్నారు. ఆరోగ్యానికి సంబంధించిన మెడికల్ ఇన్సూరెన్స్ గురించి కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న సమయంలో డ్రెస్ కోడ్ మరియు ఐడి కార్డ్స్ తప్పకుండా ధరించవలెనని, ప్రతి జిల్లాకు ఒక ఆడిటోరి అని ఏర్పాటు చేసి సాంస్కృతిక సారధికి ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, సాంస్కృతిక సారథులు వివిధ పార్టీలకు ప్రచారం చేయొద్దని ఒకవేళ ప్రచారం చేసినట్టుంటే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా సాంస్కృతిక సారధి కళాకారులు జిల్లా టీం లీడర్ ఎడమల శ్రీధర్ రెడ్డి, టీం లీడర్ పొత్తూరి రాజు,గుగ్గిళ్ల పరశురాములు,గణేష్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.



## తుంగళ్లపల్లిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

**బలగం టీవీ , తంగళ్ళపల్లి**

తంగళ్లపల్లి మండలం కేంద్రం లో ముందస్తుగా క్రిస్మస్ వేడుకలను తహశిల్దార్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు టోనీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రిస్మస్ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తుందని ప్రపంచవ్యాప్తంగా ప్రాంతాల కతీతంగా దేవుడు ఒక్కడే అనే నిదానంతోని ఏ మతానికి చెందిన వారైనా ఎవరైనా లోక కళ్యాణం కోసమే ప్రేమ అనురాగాలతోటే ఏసుక్రీస్తు సన్నిధిలో క్రిస్మస్ వేడుకలను జరుపుకోవడం శుభప్రదం అన్నారు. యెహెూవా సాటి మనిషిని ప్రేమించాలి సాటివారికి అండగా ఉండాలన్నారు.అనంతరం పాస్టర్స్ మండలంలోని క్రైస్తవ మందిర నిర్మాణం కోసం 5 గుంటల స్థలం కావాలని వేదిక పై కోరగా ప్రజా ప్రతినిధులు,ఏమ్మార్వో సానుకూలంగా స్పందిచారు.ఈ కార్యక్రమం లో గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ స్వరూప, జిల్లా పాస్టర్స్ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు జేమ్స్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా రైతు దినోత్సవ వేడుకలు..



**బలగం టీవీ, బోయినిపల్లి**

జాతీయ రైతు దినోత్సవ వేడుకలను బోయిని పల్లి మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.రైతు సంఘం అధ్యక్షుడు నాగం మల్లేశం అధ్యక్షతన కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్బంగ రైతు సంఘా నాయకులు మాట్లాడుతూ మట్టిని నమ్ముకుని నిద్రనక,వాననక ఆరుగాలం కష్టపడి పండించే వ్యక్తి రైతు అని,అలాంటి రైతుకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతు దినోత్సవాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గుంటి శంకర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లెంకల సత్యనారాయణ రెడ్డి, నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, గుంటి తిరుపతి, కోరే కొమురయ్య, మెరుపుల గంగాధర్ , దాసరి సుధాకర్, ద్యావ నరేందర్ రెడ్డి, ఈర రాజు, సంబ శ్రీనివాస్, పేగ్గర్ల శంకరయ్య, నాగం అనిల్, తదితలు ఉన్నారు.

## విమానాశ్రయం సమీపంలో అగ్నిప్రమాదం

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్పోర్టు సమీపంలో సోమవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఎయిర్పోర్టుకు సమీపంలోని ఓ బ్యాటరీల కంపెనీలో మంటలు చెలరేగినట్లు అధికారులు, పోలీసులు నిర్ధారించారు. ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది.. మంటలను అదుపు చేసింది. నిర్మాణంలో ఉన్న బ్యాటరీల కంపెనీ మూడో అంతస్తులో మంటలు చెలరేగడంతో.. కార్మికులు పరుగులు తీశారు. అయితే అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించకపోవడంతో పోలీసులు, కంపెనీ యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు.

# తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి టాలీవుడ్ అవసరం

- తెలుగు చిత్రసీమకు రెండు రాష్ట్రాలు సమానమే
- టాలీవుడ్ ఇండస్ట్రీ ఏపీకి తరలి వెళుతుందనే ప్రచారం సరి కాదు
- నిర్మాత సూర్యదేవర నాగవంశీ

**బలగం టీవీ, హైదరాబాద్**



రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి టాలీవుడ్‌కు అవసరమని, ఇండస్ట్రీ ఏపీకి తరలిపోతుందనే ప్రచారం కరెక్ట్ కాదని,.. అది తప్పుడు ప్రచారమని నిర్మాత సూర్యదేవర నాగవంశీ స్పష్టం చేశారు. బాలకృష్ణ హీరోగా నిర్మాత నాగవంశీ తెరకెక్కించిన డాకు మహారాజ్ మూవీ సంక్రాంతి రేసులో ఉన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం నాడు ఆ సినిమా మేకర్స్ మీడియా సమావేశం నిర్వహించారు.

'పుష్ప-2' ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్‌లో చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటన రెండు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఘటన నేపథ్యంలో అల్లు అర్జున్ అరెస్టుతో తెలంగాణ సర్కార్ తెలుగు సినిమా పరిశ్రమపై కక్ష గట్టిందంటూ ప్రతి పక్షాలు ఫైర్ అవుతున్నాయి. ఈ క్రమంలో సినిమా ఇండస్ట్రీ ఏపీకి తరలి వస్తే... అన్ని ఏర్పాట్లు చేస్తామని కొందరు నేతలు అన్నారు. దాంతో టాలీవుడ్ సినిమా పరిశ్రమ ఏపీకి తరలి వెళుతుందని వార్తలు వచ్చాయి. అయితే, వార్తలపై తాజాగా నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడారు. టాలీవుడ్ ఇండస్ట్రీ ఏపీకి తరలి వెళుతుందనే ప్రచారం కరెక్ట్ కాదన్నారు. తాను ఇక్కడే ఖరీదైన ఇల్లు కట్టుకున్నానని, ఇప్పుడు ఏపీకి వెళ్లి ఏం చేస్తానని అన్నారు. అలాగే తెలుగు చిత్రసీమకు రెండు తెలుగు రాష్ట్రాలు సమానమేనని పేర్కొన్నారు. ఇక త్వరలో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో భేటీ విషయంపై మాత్రం తనకు ఎలాంటి సమాచారం లేదన్నారు.

సంక్రాంతి సినిమాలకు పెయిడ్ ప్రీమియర్స్ అవసరం లేదనీ, తెల్లవారుజామున నాలుగు గంటలకు షో పడితే చాలన్నారు. ప్రస్తుతం ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు అమెరికాలో ఉన్నారనీ, ఆయన వచ్చాక, సీఎం రేవంత్ రెడ్డిని కలువాలా? లేదా? అనే చర్చించుకుంటామని తెలిపారు. మరో కొన్ని రోజుల్లో దిల్ రాజ్ సినిమా కూడా విడుదల కాబోతుందనీ, ఏం తేలుస్తారో చూడాలన్నారు. అందరితో పాటూ తాను కూడా ఉంటాననీ, దిల్‌రాజు హైదరాబాద్ వచ్చాక అందరూ కలిసి డిసైడ్ చేసి మాట్లాడుతామని అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్‌గారిని కలుద్దామని, తనతో అయితే ఎవరూ చెప్పలేదని నాగ వంశీ పేర్కొన్నారు.

## ఇండియాకు 'గేమ్ చేంజర్' టీమ్

**బలగం టీవీ, హైదరాబాద్**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా ప్రముఖ దర్శకుడు శంకర్ డైరెక్షన్‌లో రూపుదిద్దుకున్న 'గేమ్ చేంజర్' చిత్రం సంక్రాంతి కానుకగా 2025 జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను 'ఛరిష్మా డ్రీమ్స్' రాజేశ్ కల్లేపల్లి ఆధ్వర్యంలో అమెరికాలోని డాలస్ నగరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దర్శకుడు సుకుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. అలాగే నిర్మాత దిల్ రాజు, సంగీత దర్శకుడు తమన్, డైరెక్టర్ శంకర్ ఫ్యామిలీ, హీరో రామ్ చరణ్, ఇతర చిత్రబృందం పాల్గొన్నారు. ఇక ఈ మెగా ఈవెంట్ ముగిసిన అనంతరం 'గేమ్ చేంజర్' టీమ్ ఇండియాకు తిరుగు పయనమైంది. ఈ మేరకు చిత్రబృందం ఓ ఫొటోను పంచుకుంది. ఫొటోలో చెర్రీ, నిర్మాతలు దిల్ రాజు, శిరీష్, దర్శకుడు బుచ్చిబాబు, నటుడు ఎస్‌జే సూర్య, ఇతరులు ఉన్నారు.

## మోహన్ బాబుకు షాక్..!

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణ హైకోర్టులో సినీ నటుడు మోహన్ బాబుకు షాక్ తగిలింది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. జల్‌పల్లిలోని తన ఇంటి వద్ద విలేకరులపై దాడి కేసులో మోహన్ బాబు నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో మోహన్ బాబును ఏ క్షణంలోనైనా అరెస్ట్ చేస్తారనే ఊహాగానాలు వినిపించాయి. ఈ క్రమంలో ఆయన ముందస్తు బెయిల్ కోరుతూ ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. అనారోగ్యంతో ఉన్నందున బెయిల్ ఇవ్వాలని కోరారు. విచారించిన హైకోర్టు ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. ప్రస్తుతం మోహన్ బాబు తిరుపతిలో ఉన్నట్లు ఆయన తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు.

# సలార్-1తో సంతోషంగా లేను రెండో పార్ట్ మాత్రం నా కెరీర్‌లో బెస్ట్

- దర్శకుడు ప్రశాంత్ నీల్

**బలగం టీవీ, హైదరాబాద్**



సలార్: పార్ట్-1 సీజ్ ఫైర్' మూవీ రిజల్ట్ విషయంలో అంత సంతోషంగా లేనని కన్నడ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ అన్నారు. ఆయన రూపొందించిన ఈ యాక్షన్ మూవీ విడుదలై ఆదివారంతో ఏడాది పూర్తయింది. భారీ అంచనాల నడుమ వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా ఏకంగా రూ.700 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఎన్నో రికార్డులను తన ఖాతాలో వేసుకుంది. ఇక ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రశాంత్ నీల్‌ను 'సలార్ 1' రిజల్ట్ మీకు థియేటర్‌లో ఆ స్థాయి సంతోషాన్ని ఇచ్చిందా?' అని ప్రశ్నించగా, "సలార్-1' రిజల్ట్ వల్ల నేను సంతోషంగా లేను. ఫస్ట్ పార్ట్ కోసం నేను పడిన కష్టంతో పోలిస్తే, ఇది కాస్త నాకు నిరాశగానే అనిపించింది. ఎక్కడో 'కేజీయఫ్ 2' ఛాయలు కనిపించాయి. ఇక ఎప్పుడూ అలా జరగదు. అయితే 'సలార్ 2' మాత్రం నా కెరీర్‌లో బెస్ట్ మూవీగా తప్పకుండా తీస్తాను. ప్రేక్షకులను అంచనాలను మించేలా తీర్చిదిద్దుతాను. జీవితంలో కొన్ని విషయాలపై చాలా క్లారిటీతో ఉన్నాను. నేను మరోసారి చెబుతున్నా, ఎవరూ ప్రశ్నించే వీలు లేకుండానే 'సలార్ 2' నా బెస్ట్ మూవీల్లో ఒకటిగా ఉంటుంది" అని ప్రశాంత్ నీల్ చెప్పాడు.

# ఘనంగా పీవీ సింధు పెండ్లి వేడుక

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు వివాహం పోసిడెక్స్ టెక్నాలజీస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, హైదరాబాద్‌కు చెందిన 29 ఏళ్ల వెంకట దత్త సాయితో ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. రాజస్థాన్ ఉదయ్‌పూర్ వేదికగా జరిగిన ఈ వివాహ వేడుకకు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు, పలువురు ప్రముఖులు హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు. రాత్రి 11.20 గంటలకు మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. ఇక మంగళవారం హైదరాబాద్‌లో రిసెప్షన్ జరగనుంది.





## వినోద్ కాంబ్లి ఆరోగ్యం విషమం

**బలగం టీవీ, హైదరాబాద్**

క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ చిన్ననాటి స్నేహితుడు, భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ మరోసారి ఆసుపత్రి పాలయ్యారు. అనారోగ్య పరిస్థితితో కొద్ది వారాలుగా ఇబ్బంది పడుతూ గతం శనివారం రాత్రి థానేలోని ఆకృతి ఆసుపత్రిలో చేరిన భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ ఆరోగ్య పరిస్థితి క్షీణించినట్టు తెలుస్తోంది. అవసరమైన వైద్యపరీక్షలు చేసినప్పటికీ ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్నారు. 52 ఏళ్ల కాంబ్లి తన చిన్ననాటి మిత్రుడు, లెజెండ్రీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌ను ఇటీవల రమాకాంత్ అచ్రేకర్ మెమోరియల్‌లో కాంబ్లి కలుసుకున్నారు. ఈ ఈవెంట్‌లో ఆయన వీల్‌చైర్‌లో కూర్చుని కనిపించినప్పటి నుంచి క్రికెట్ అభిమానులు ఆయన ఆరోగ్యంపై ఆందోళన చెందుతున్నారు.

కాంబ్లి తీవ్ర అనారోగ్యం పాలుకావడం ఇదే మొదటిసారి కాదు. అయితే ఈసారి ఆయనకు ఆర్థిక సాయం చేసేందుకు 1983 వరల్డ్ కప్ స్క్వాడ్ మెంబర్లు ముందుకు వచ్చారు. సాయం అందుకునేందుకు కాంబ్లీ సైతం సంసిద్ధత వ్యక్తం చేశారు. రిహాబిలేషన్ సెంటర్‌కు వెళ్లేందుకు తాను సిద్ధమేనని, అక్కడికి వెళ్లేందుకు తనకెలాంటి భయం లేదని, తన కుటుంబం కూడా తనతోనే ఉందని ఇటీవల వెల్లడించారు. జడేజా తనకు మంచి మిత్రుడని, ఇటీవల తనకు చూడడానికి కూడా వచ్చాడని, 'కమాన్ గెటప్' అంటూ తనను ఉత్సాహపరిచాడని కాంబ్లి గుర్తుచేసుకున్నారు. ఆలస్యంగానైనా చాలా మంది ఇప్పుడు తనను చూడడానికి వస్తున్నారని చెప్పారు. బీసీసీఐ కూడా తనకు హెల్త్ చేస్తుందని అనుకుంటున్నానని, అబెయ్ కురువిల్ల (మాజీ ఇండియన్ పేసర్) కూడా బీసీసీఐతో ఉన్నారని, తనతోనూ, తన భార్యతోనూ ఆయన ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నారని కాంబ్లి తెలిపారు. సచిన్ తనకు ఎప్పుడూ ఏమీ చేయలేదని అనుకునేవాడినని, అయితే తనకు గతంలో రెండు సర్జరీలు జరిగినప్పుడు మెడికల్ బిల్స్ ఆయనే చెల్లించారని, తమ స్నేహం ఎప్పటిలాగే ఉందని ఇటీవల ఒక ఇంటర్వ్యూలో కాంబ్లీ తెలిపారు.



# పాకిస్థాన్ క్లీన్ స్వీప్

**బలగం టీవీ, జొహన్నస్‌బర్గ్**

సౌతాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌ను పాకిస్థాన్ క్లీన్ స్వీప్ చేసింది. మూడవ వన్డేలో డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం.. 36 రన్స్ తేడాతో పాక్ విజయం సాధించింది. పాకిస్థాన్ ఓపెనర్ సయిమ్ అయూబ్ 94 బంతుల్లో 101 రన్స్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. వాండరర్స్‌లో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ తొలుత 9 వికెట్ల నష్టానికి 308 రన్స్ చేసింది. ఆ తర్వాత వర్షం వల్ల మ్యాచ్‌ను 47 ఓవర్లకు కుదిరించారు. 308 టార్గెట్‌తో బరిలోకి దిగిన సౌతాఫ్రికా 42 ఓవర్లలో 271కు ఆలౌటైంది.

పాక్ బ్యాటర్ అయూబ్ బాబర్ ఆజమ్‌తో రెండో వికెట్‌కు114 రన్స్ జోడించాడు. ఆ తర్వాత రిజ్వాన్‌తో కలిసి మూడో వికెట్‌కు 93 రన్స్ జోడించాడు. 22 ఏళ్ల అయూబ్ తొలి వన్డేలో కూడా సెంచరీ చేశాడు. ఈ మ్యాచ్‌లో అయూబ్ రెండు సిక్సర్లు, 13 ఫోర్లు బాదాడు. మిడిల్ ఆర్డర్‌లో సల్మాన్ ఆఘా 33 బంతుల్లో 48 రన్స్ చేశాడు. దక్షిణాఫ్రికా బౌలర్ కగిసో రబడ 3 వికెట్లు తీసుకున్నాడు. ఛేజింగ్‌లో దక్షిణాఫ్రికా బ్యాటర్ క్లాసెన్ అత్యధికంగా 81 రన్స్ చేశాడు. బాష్ 40 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. పాక్ స్పిన్నర్ సుఫియాన్ ముఖీమ్ 52 రన్స్ ఇచ్చి 4 వికెట్లు తీసుకున్నాడు. తొలి వన్డేను 3 వికెట్ల తేడాతో, రెండో వన్డేను 81 రన్స్ తేడాతో పాక్ గెలిచిన విషయం తెలిసిందే. అయితే టీ20 సిరీస్‌ను మాత్రం 2-0 తేడాతో దక్షిణాఫ్రికా గెలిచింది. గురువారం నుంచి రెండు దేశాల మధ్య రెండు టెస్టుల సిరీస్ జరగనున్నది.

## 'డాకు మహారాజ్' నుంచి రెండో పాట విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**



నందమూరి బాలకృష్ణ హీరోగా దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న సినిమా 'డాకు మహారాజ్'. ప్రజ్ఞా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటించారు. సంక్రాంతి కానుకగా 2025 జనవరి 12న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రచారంలో భాగంగా చిత్ర బృందం సెకండ్ సాంగ్‌ను రిలీజ్ చేసింది. 'చిన్ని' అంటూ సాగే ఈ గీతానికి అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా తమన్ స్వరాలు సమకూర్చారు.